క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి జన్మదినోత్సవం



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్లలో గల శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంత్రోచ్చారణల నడుమ వేదపండితులు వేడుకల్ని శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలోని అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజన ఆకట్టుకుంది. భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద మహా అన్నదానం చేపట్టారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సత్తెనపల్లి: త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నరసరావుపేట నుంచి ప్రయాణికులతో సత్తెనపల్లి వస్తోంది. ఈ సమయంలో పట్టణంలోని గాంధీ చౌక్ వైపు నుంచి కారు వస్తోంది. రెండూ గడియార స్తంభం సెంటర్‌లో ఢీకొన్నాయి. కారులో ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు డ్రైవర్ వైపు భాగం, ముందు అద్దం ధ్వసమైంది. ఆర్టీసీ బస్సు ఎడమ వైపు ముందు భాగం కొద్దిగా దెబ్బతింది.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

పెదకూరపాడు: స్థానికంగా నడుస్తున్న పేకాట స్థావరంపై పెదకూరపాడు ఎస్‌ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది దాడి చేశారు.తొమ్మిది మంది జూదరుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 31,830, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వరుస చోరీలతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం



పెదకూరపాడు: వరుస చోరీలతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మాలకు రక్షణ లేకుండా పోతోంది. మండలంలో గత ఏడాదిగా వరుసగా జగనన్న కాలనీలనే లక్ష్యంగా దొంగలు విద్యుత్ తీగలు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫారాల్ని ఎత్తుకుపోయారు. పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యంగా ఉంది. శనివారం మండలంలోని కంభంపాడు- పరస గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన 42 నుంచి 62 వరకు ఉన్న విద్యుత్ స్తంభాల తీగలు సుమారు కిలో మీటర్ వరకు చోరీకి గురయ్యాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటం గమనించిన దొంగలు పవర్ ఆఫ్ స్విచ్ క్లోజ్ చేసి చోరీ చేశారు. గత ఏడాది కంభంపాడు గ్రామంలోని ఉంగుటూరు వైపు వెళ్లే జగనన్న కాలనీలో నాలుగు సింగిల్ ఫేజ్ స్తంభాలు చోరీ చేశారు. కంభంపాడు- పరస మధ్య చోరీకి గురైన విద్యుత్ తీగలు సుమారు రూ.లక్ష విలువ చేస్తాయని సిబ్బంది తెలిపారు. కంభంపాడులో చోరీకి గురైన ట్రాన్స్‌ఫారంలు రూ.4 లక్షలు విలువ చేస్తాయి. లింగంగుంట్ల, పెదకూరపాడు జగనన్న కాలనీల్లో రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫారాలు, పెదకూరపాడు జగనన్న కాలనీలో రూ.లక్ష విలువ చేసే విద్యుత్ తీగల్ని దొంగలు చోరీ చేశారు. వీటిపై ఏఈ రామకృష్ణ పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని పోలీసులు

పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో దొంగలు పేట్రేగి పోతున్నారు. గత ఏడాది జరిగిన చోరీల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం అటుంచితే శనివారం పరస-కంభంపాడు ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ తీగలనే ధైర్యంగా చోరీ చేశారంటే ఆశ్చర్యం కలిగిస్తోంది. పోలీసులు స్పందించి చోరీలకు అడ్డుకట్ట వేయాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యపు నీడలు

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన 334 మంది విద్యార్థులు
- నియోజకవర్గంలో 88 మంది ఉపాధ్యాయుల కొరత
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రూ.17.60 లక్షల బిల్లులు పెండింగ్
- పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు పనిచేయక అందని మంచినీరు



సత్తెనపల్లి బాలికోన్నత పాఠశాలలో వరండాలో మధ్యాహ్నభోజన చేస్తున్న విద్యార్థినిలు

సత్తెనపల్లి: విద్యారంగంలో గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు విప్లవాత్మకం అనిపించుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో సకల సదుపాయాలతో తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ శ్రద్ధ కొరవడింది. ఉపాధ్యాయుల కొరత, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు బిల్లులతో సహా పలు సమస్యలు తిష్టవేసుకున్నాయి. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య కూడా తగ్గింది.

* సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి టౌన్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 217 ఉండగా, వీటిలో ప్రాథమిక పాఠశాలలు 168, ప్రాథమికోన్నత పాఠశాలలు 18, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 31 ఉన్నాయి. వీటిల్లో కలిపి మొత్తం 1,034 మంది ఉపాధ్యాయులకు గాను ప్రస్తుతం 956 మంది పనిచేస్తున్నారు. 88 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కొందరు టీచర్లను బదిలీ చేసినప్పటికీ, వాటిని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో పాఠశాలల్లో ఖాళీలు అలాగే ఉండిపోయాయి.

* 2024-25 విద్యాసంవత్సరానికి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది. గతేడాది పాఠశాలల్లో 3,732 మంది విద్యార్థుల ప్రవేశాలు జరగ్గా ఈ ఏడాది 3,398 మంది ఉన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 334 మంది విద్యార్థులు తగ్గారు.

* మధ్యాహ్న భోజనం పథకానికి కంకు సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 218 ఏజెన్సీలు పని చేస్తున్నాయి. వీటికి రూ.17,62,737 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నియోజకవర్గంలో విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందజేశారు.

* సత్తెనపల్లి మండలం గుడిపూడిలోని ఎంపీపీ ఎస్ (యు) పాఠశాల, కొమెరపూడిలోని ఎంపీపీ ఎస్ (హెచ్‌ఈ) పాఠశాల, పాకాలపాడులో ఎంపీపీఎస్(ఎల్‌ఈ) పాఠశాలలు శిథిలావస్థలో నడుస్తున్నాయి.

* సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి మండలంలోని లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామకృష్ణాపురం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (బాలికలు), లక్కరాజుగార్లపాడు ఎంపీపీఎస్(డీడబ్ల్యూ), భీమవరంఎంపీపీఎస్, రెంటపాళ్ల ఎంపీపీఎస్(హెచ్‌ఈ), కందులవారిపాలెం ఎంపీయూపీఎస్, బృగుబండ ఎంపీపీ ఎస్(ఎల్‌ఈ) పాఠశాలల్లో శుద్ధజల యంత్రాలు నిర్వహణ లోపం కారణంగా పని చేయడం లేదు. ఒక పాఠశాలలో మోటార్ కాలిపోతే మరొక పాఠశాలలో కాయిల్స్ కాలిపోయి పని చేయడం లేదు. దీంతో విద్యార్థులు కుళాయి నీళ్లనే తాగుతున్నారు. నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీచర్ల కొరత.. బోధనకు వెత



బుస్సాపురంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల

పెదకూరపాడు: నియోజకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి , బెల్లంకొండ , క్రోసూరు, అచ్చంపేట మండలాలలో ప్రాథమిక పాఠశాలలు 171 ఉన్నాయి. వాటిలో 6183 మంది విద్యార్థులకు గానూ 337 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 33 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.

* ప్రాథమికోన్నత పాఠశాలలు 33 ఉన్నాయి. వాటిల్లో 2,818 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 250 మంది ఉపాధ్యాయులకు 236 మంది పని చేస్తున్నారు. 14 మంది ఉపాధ్యాయులు కొరత ఉంది.

* జిల్లా పరిషత్ పాఠశాలలు మొత్తం 27 ఉన్నాయి. వాటిలో 8154 మంది విద్యార్థులకు 345 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. 43 మంది టీచర్ల కొరత ఉంది.

తగ్గిన విద్యార్థుల సంఖ్య

2024-25 విద్యాసంవత్సరంలో నియోజకవర్గంలో మొత్తం 2285 మంది విద్యార్థులు నూతనంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశించారు. 2023-24లో 2818 మంది విద్యార్థులు ప్రవేశించగా గత ఏడాది కన్న సంఖ్య తగ్గింది.

శిథిలావస్థలో పలు పాఠశాలలు

నియోజకవర్గంలో తొమ్మిది పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. నియోజకవర్గంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు 274 ఉన్నాయి. వాటిలో విద్యార్థులు 70 శాతం మంది మాత్రమే తింటున్నారు.



సత్తెనపల్లి సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేయని ఆర్వో ప్లాంట్



సత్తెనపల్లి బాలికోన్నత పాఠశాలలో ట్యాపులు లేని వాష్‌బేషిన్

కంపెనీవారే మరమ్మతు చేయాలి



ఆర్వో ప్లాంట్లు ఎక్కడెక్కడ పని చేయడం లేదో తెలుసుకొని కంపెనీ వారికి ఫిర్యాదు చేశాం. ఒప్పందం ప్రకారం వారే వచ్చి మరమ్మతులు చేయాలి. అయితే, ఇటీవల ప్రభుత్వం మారడం వల్ల తమ కంపెనీ ప్రతినిధుల నుంచి తమకు ఆదేశాలు రాలేదని స్థానిక సిబ్బంది చెబుతున్నారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి త్వరితగతిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

–ఏ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, సత్తెనపల్లి

తాగునీరు అందేలా చూడాలి



పాఠశాలల్లో విద్యార్థులకు రక్షితనీరు అందేలా చూడాలి. ఆర్వో సిస్టమ్ మరమ్మతులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలి. ఇప్పటికీ విద్యార్థులు ఇంటి నుంచే బాటిళ్లలో నీరు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

–బొరిగర్ల వెంకట్రావు,ముప్పాళ్ల

శ్రావణం .. శుభప్రదం

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ముస్తాబైన దేవాలయాలు
- వ్రతాలు, నోములకు సిద్ధమవుతున్న మహిళలు



పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో వేణుగోపాలస్వామి దేవాలయం

సత్తెనపల్లి: పవిత్రమైన శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు, నోములు శుభ ఫలితాలు ఇస్తాయని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. ఇదే నెలలో వరలక్ష్మి, మంగళగౌరి వ్రతాలు, నాగపంచమి, రాఖీపౌర్ణమి, పోలాల అమావాస్య వంటి ముఖ్యమైన పండుగలు రావడంతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల రోజుల పాటు ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.ప్రత్యేక పూజలు,గోత్రనామాలతోఅభిషేకాలు,ఆధ్యాత్మిక వాతావరణం సంతరించు కుంటుంది. హరిహర నామస్మరణతో ఆలయాలు మార్మోగుతాయి. ఇప్పటికే శ్రావణమాస పూజలకు ముస్తాబయ్యాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ప్రతి శుక్రవారం ప్రత్యేకమే...

పౌర్ణమి నాడు చంద్రుడు శ్రవణా నక్షత్రం మీద సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణం అనే పేరు వచ్చింది. ఈ నెలలో వచ్చే శుక్రవారాలను వ్రతాలకు, నోములకు కేటాయించడం వెనక పెద్ద కథ ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నక్షత్రం కూడా శ్రవణమే ఆయన భార్య లక్ష్మీదేవికి, సోదరి గౌరీదేవికి శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తారు.

నోముల మాసం

పురోహితులు శ్రావణ మాసాన్ని నోములు మాసంగా లెక్కిస్తారు. ఈ మాసంలో వచ్చే ఏ మంగళవారం నాడు అయినా మంగళ గౌరీ వ్రతాన్ని చేయవచ్చు. దీన్ని యువతులు పెళ్లయిన తర్వాత ఏడాది వరకు ఆచరిస్తారు. వరలక్ష్మి వ్రతాన్ని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకుంటారు. దీన్ని జీవితాంతం ఆచరిస్తారు.

ముఖ్యమైన పండుగలు

శ్రావణమాసమంతా పండుగల సందడి ఉంటుంది. ఈనెల తొమ్మిదిన తొలి శుక్రవారం, 11న భానుసప్తమి, 16న రెండో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. శ్రావణమాసం తర్వాత వచ్చే భాద్రపద మాసంలో వినాయక చవితి సందడి మొదలవుతుంది.

30 రోజుల్లో 11 ముహూర్తాలు

శుక్ర మౌఢ్యం, ఆషాఢ మాసంతో 100 రోజుల బ్రేక్ తరువాత ఈ నెల 7 నుంచి 28 వరకు 11 ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలకు మంచిదని ప్రజల నమ్మకం. ముఖ్యంగా ఈ నెలలో 7,8,9,11,15,17,18,19,22,23,28 తేదీలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో ఎక్కువ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు అంటున్నారు.

వ్రతాల వెనుక ఆరోగ్య రహస్యాలు

పూజలు, వ్రతాలు, నోముల ఆచరించడంలో ఆరోగ్యపరమైన కారణాలు చాలా ఉన్నాయి. వరలక్ష్మి వ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలకెత్తిన శెనగలు పోషక నిలయాలు. వీటిలో మాంసకృతులు తక్షణ శక్తిని ఇస్తాయి. నైవేద్యంగా ఆరగించే చలివిడి చలువ చేస్తుంది. గర్భధారణ అవరోధాలను తొలగిస్తుంది. వర్షాకాలం పాదాలు ఎక్కువ సేపు తడిగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లు కలుగుతుంటాయి. నివారణకు కాళ్లకు పసుపు పూసుకోవడాన్ని ఈ వ్రతాల్లో భాగం చేశారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే ధూపం వాయు కాలుష్యాన్ని హరిస్తుంది.

భక్తిశ్రద్ధలతో రేణుకమ్మ తల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ప్రవీణ్,

పెదకూరపాడు: మండలంలోని బుచ్చయ్యపాలెంలో గల రేణుకమ్మ తల్లికి ఆషాడం చివరి రోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కరుణించి కాపాడమ్మ రేణుకమ్మ తల్లి అంటూ ప్రార్థించారు. ఆషాఢ మాసం చివరి రోజు అమ్మవారిని దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసం. ఆలయ నిర్మాణ, నిర్వాహణ కమిటీ అధ్యక్షులు పరుచూరి నాని ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శనివారం రాత్రి పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే ప్రవీణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దఎత్తున మహిళలు కోలాటమాడుతూ అమ్మవారి వెంట నడిచారు.

పెదనెమలిపురిలో పోలీసులు పహారా



గొడ్డళ్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రాజుపాలెం: పాతకక్షల నేపథ్యంలో హింసాత్మక సంఘటనలు మరొకసారి చోటు చేసుకోకుండా పోలీసులు పెదనెమలిపురిలో పటిష్ట చర్యలు చేపడుతున్నారు. గత నెల రోజులుగా పహారా నిర్వహిస్తూ శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో రాజుపాలెం ఎస్‌ఐ అమీర్ బాషా 15 మంది సిబ్బందితో పికెట్ నిర్వహిస్తున్నారు. గ్రామంలో 2022లో వైఎస్సార్ సీపీ నేత, ప్రస్తుత సర్పంచ్ భర్త కె.శ్రీనివాసరావు ప్రత్యర్థుల చేతుల్లో దారుణంగా హత్యకు గురయ్యాడు. తరువాత మూడు నెలలకు మరొక హత్య జరిగింది. అప్పటిలో టీడీపీకి చెందిన పలువురిని నిందితులుగా గుర్తిస్తూ కోర్టుకు హాజరుపరిచారు. బెయిల్‌పై వచ్చిన వారు వేరే ప్రాంతాల్లో ఉంటూ నెల రోజుల కిందట తిరిగి గ్రామానికి వచ్చారు. దీంతో ఇంటిలిజెన్స్ సూచనల మేరకు మరొకసారి గ్రామంలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవచ్చు అనే అనుమానంతో జిల్లా ఎస్పీకి పికెట్ ఆదేశించారు. ఏఆర్ పోలీసులు 10మంది, స్థానిక పోలీసులు ఐదుగురు అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. రోజు మార్చి రోజు సీఐ, ఎస్‌ఐలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తున్నారు. గ్రామంలో ప్రతి రోజు ప్రధాన కూడలిలో గ్రామస్తులకు శాంతిభద్రతలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

అడుగుకో గొయ్యి ..గజానికో గుంత



పట్టణంలో అధ్వానంగా ఉన్న భీమవరం రోడ్



పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

సత్తెనపల్లి: పట్టణంలో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రహదారులన్నీ గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రహదారు లకు మరమ్మతులు చేపట్టేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తవుతున్నా మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని భీమవరం రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, అచ్చం పేట రోడ్డుతో పాటు ప్రధాని రహదారి అధ్వానంగా మారాయి. పాలకులు, అధికారులు స్పందించి కనీసం గోతులైన పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పట్టణంలోని సాంబశివపేట నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని పల్నాడు బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 170 మందికి పైగా రోగులకు డాక్టర్ నెల్లూరి రమేష్, బీపీ, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, నరాల వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కల పంపిణీని పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య, డాక్టర్ నెల్లూరి రమేష్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సభ్యులు కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరావు, సిలార్ మసూద్, ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజలకు అవస్థలు

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటకు ప్రతి నిత్యం వివిధ పనులపై వచ్చే ప్రజలు పబ్లిక్ టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఇన్‌చార్జ్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, ఐదు గిరిజన తండాలు, మూడు కుగ్రామాలు ఉన్నాయన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రైతులు, గ్రామాల నుంచి వచ్చే వందలాది మంది ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎంపీపీ గంగసాని బాబు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజాసేవే కర్తవ్యంగా పనిచేయాలని సూచించారు. రోకటిగుంటవారిపాలెం సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామాన్ని చిగురుపాడు గ్రామ పంచాయతీ నుంచి విడగొట్టి ప్రత్యేకంగా గుర్తించినప్పటికీ నిధులు కేటాయించడంలో మాత్రం అధికారులు అశ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. వేల్పూరు సర్పంచ్ జువ్వా శంకర్ మాట్లాడుతూ వెలుగు కార్యాలయంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. వివిధ శాఖల అధికారులు పనుల పురోగతిపై నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీవో కుసుమకుమారి, వైస్ ఎంపీపీ తెల్లమేకల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతోనే ప్రమాదాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం వాహనదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని ఆయన సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నడిపి ప్రమాదాలు చేయవద్దని, ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి నడపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడే కఠిన చర్యలు

సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు



ముప్పాళ్ల: ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ వివాదాలను విడనాడి కలిసిమెలిసి ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు సూచించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల ముస్లిం కాలనీలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులకు శాంతిభద్రతలపై శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివాదాలకు వెళ్లే ముందు కుటుంబసభ్యుల్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఏదైనా జరిగితే కుటుంబమంతా నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు సహకరించి గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని చెప్పారు. వాహనదారులు మారిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ద్విచక్రవాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.హజరతయ్య, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.